క్లుప్తంగా

ఉచిత యోగా శిక్షణ తరగతులకు ఆహ్వానం

తగరపువలస : 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 10 నుంచి 21 వరకు చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపంలో ఉచితంగా యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు శిబిరంలో శిక్షణ నిర్వహించనున్నారు. మధుమేహం, కీళ్లవాతం, మోకాళ్ల నొప్పులు, చర్మరోగాలు, శ్వాసకోశ వ్యాధులు, రక్తపోటు, పార్శ్వ తలనొప్పి, స్థూలకాయం, మానసిక ఒత్తిడి మొదలైన ఆరోగ్య సమస్యలకు ఈ శిబిరంలో పరిష్కారం లభిస్తుందన్నారు. వివరాలకు 08933 228222, 94406 43531, 96660 26661లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పద్మనాభం : పద్మనాభం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని రేవిడి, పద్మనాభం టౌన్ ఫీడర్లకు మరమ్మతులు చేపట్టనున్నందున వీటి పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం ఆపరేషన్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కురపల్లి, కొండ బర్లపేట, పద్మనాభం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

భైరవస్వామికి విశేష అభిషేకాలు



భైరవస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: అమావాస్య సందర్భంగా భైరవస్వామికి గురువారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భైరవస్వామిని దర్శించుకున్నారు. విభూదితో అభిషేకం నిర్వహించారు.

రామానాయుడుకు ఘన నివాళి



రామానాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

కొమ్మాది : ప్రముఖ నిర్మాత దివంగత డి.రామానాయుడు 88వ జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో గల ఫిల్మ్ స్టూడియోలో సురేష్ ప్రొడక్షన్ మేనేజర్ వేణు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ వేణు మాట్లాడుతూ నేటి తరానికి రామానాయుడు రోల్ మోడల్ అని, ఎందరో నటీనటులను తెలుగు తెరకు పరిచయం చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ స్టూడియో మేనేజర్ వంశీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే జీవకోటికి మనుగడ



పాఠశాలలో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు, మ్యాజిక్‌బస్ ప్రతినిధులు



దివీస్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎండీ మురళీకృష్ణ తదితరులు



చిట్టివలస హైస్కూల్‌లో మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

తగరపువలస : మొక్కల పరిరక్షణతోనే జీవకోటికి మనుగడ సాధ్యమవుతుందని భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ ఎండీ మురళీకృష్ణ దివి, హోల్ టైం డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం మన భూమి – మన భవిష్యత్ పేరుతో ఉద్యోగులతో గ్రీన్ ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ భూ పునరుద్ధీకరణ, ఎడారీకరణ, కరువు తగ్గించుకోవడానికి మొక్కలు పెంచడం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో భాగంగా పర్యావరణంపై అవగాహన పెంచుకుని మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలన్నారు. భూమిని పరిరక్షించుకోకపోతే ప్రత్యామ్నాయం లేనందున ప్రతి ఒక్కరూ ప్రకృతిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

- జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ ప్రాథమిక పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కోసం ర్యాలీ చేపట్టి మొక్కలు నాటించారు. మొక్కలు నాటినప్పటి నుంచి పెద్దవి అయ్యే వరకు కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి, ఉపాధ్యాయులు డబ్బీరు రమేష్, జి.దుర్గాప్రసాద్, మ్యాజిక్ బస్ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ అధికారి దూడ రమేష్, టీం సభ్యులు శారద, దుర్గ, రమ్య, రమణమ్మ, సుజాత, నందిని తదితరులు పాల్గొన్నారు.
- చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ రోజామణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని రక్షించుకోకపోతే భవిష్యత్ నరకప్రాయం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ లక్ష్మి, భీమాబాయి, సత్యవతి, రాణి, మాధవి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ నేడు



చిట్టివలస దుర్గాలమ్మ అమ్మవారు

తగరపువలస : చిట్టివలస దుర్గాలమ్మ అమ్మవారికి శుక్రవారం పసుపు, కుంకుమ సమర్పించనున్నారు. సంతపేట, కొత్తపేట, కొండపేట, విల్సన్‌పేట, వెలంపేట, కార్మికవాడకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు బొగ్గురోడ్డులోని ఆలయం వద్ద భక్తులకు క్యూలైన్లు, టెంట్లు, తాగునీరు, మజ్జిగ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేయనున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నారు. అలాగే ఈ నెల 11న సంతపేటలోని కొత్తమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించనున్నారు.

శిల్పారామం మే నెల ఆదాయం రూ.5.83 లక్షలు



శిల్పారామం ప్రవేశ ద్వారం

పీఎం పాలెం : మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు సేద తీరేందుకు ప్రధాన వినోద, విహార కేంద్రంగా ఉన్న శిల్పారామం సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. అంతే స్థాయిలో ఆదాయమూ సమకూర్చుకుంటోంది. నిర్వహణకు అవసరమైన ఆదాయం లభించని దుస్థితి నుంచి అనతి కాలంలోనే తేరుకుంది. రాష్ట్రంలోనే అధిక ఆదాయం సంపాదించే శిల్పారామంగా గుర్తింపు దక్కించుకుంది. గత రెండు సంవత్సరాలుగా సందర్శకుల తాకిడి రోజురోజుకూ రెట్టింపు అవుతోంది. గత సంవత్సరం మే నెల ఆదాయం రూ.3.53 లక్షలుకాగా... ఈ ఏడాది మే నెలలో రూ.5.83 లక్షల మేర ఆదాయం వచ్చిందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. మహిళలు, పిల్లల కోసం మరిన్ని హంగులతో శిల్పారామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

వామ్మో.. చింపాంజీ..!



హైవేని ఆనుకుని ఏర్పాటు చేసిన చింపాంజీ బొమ్మ

మధురవాడ : ఎవరైనా కొత్త వారు కాస్త కనీ కనిపించని వెలుగులో చూస్తే నిజమైన చింపాంజీ అనుకుని వామ్మో.. అంటూ భయపడే రీతిలో హైవే పక్కన ఓ బొమ్మ ఉంది. పైగా పక్కనే తుప్పలు..., ఆ పక్కనే గెడ్డ... ఇలా వాటిలో నుంచి రోడ్డు వైపు వస్తున్నట్టు ఉంది. ఎవ్వరికైనా ఇట్టే భయం గొల్పే విధంగా దీనిని తీర్చిదిద్దారు. ఈ చింపాంజీ బొమ్మ మారికవలస ఆర్‌జీకే కాలనీ వద్ద ఓ ఫైన్ ఆర్ట్ చిత్రకారుడు తయారు చేసి ప్రచారం కోసం హైవేని ఆనుకుని ఇలా ఏర్పాటు చేశారు.

హైవే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



హైవే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తగరపువలస : స్థానిక జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. 'హైవే డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు' శీర్షికతో సాక్షిలో గురువారం ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, శానిటరీ కార్యదర్శి మనోజ్‌కుమార్ స్పందించారు. జాతీయ రహదారుల డ్రైనేజీల నిర్మాణంలోని లోపాల వల్ల చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి సంగివలస వరకు పలుచోట్ల ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు పేరుకుపోయిన సంగతి తెలిసిందే. తరచూ వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బంది కలుగుతోంది. వీటిని పూర్తిగా మురుగునీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ మోహన్‌రావు

పద్మనాభం : పచ్చిరొట్ట, పీఎండీఎస్ విత్తనాలు వరి సాగుకు ముందు వేయడం వల్ల భూసారం పెరుగుతుంతని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని పాండ్రంగిలో మహిళా రైతులకు గురువారం జీలుగ, జనుమ, పీఎండీఎస్ విత్తనాల కిట్లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ జీలుగ, జనుమ, పీఎండీఎస్ విత్తనాలు వేయడం వల్ల రసాయన ఎరువుల వాడకం తగ్గడంతోపాటు పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. పాండ్రంగి ఆర్బీకే వీఏఏ రమాదేవి మాట్లాడుతూ జీలుగ, జనుమ, పీఎండీఎస్ విత్తనాలు ఆర్బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్బీకేకు వచ్చి తీసుకెళ్లాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ఫార్మింగ్ అసోసియేట్ అనురాధ, మాస్టర్ ట్రైనర్ సాగర్, హెచ్‌ఆర్ చక్రవర్తి, గణేష్ పాల్గొన్నారు.

మిద్దె పంటల సాగును ప్రోత్సహిద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న అరుణకుమారి

మురళీనగర్ : నగరంలో నివసించే వారు మిద్దె పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని వనమాలి గ్రూపు అడ్మిన్ ఎ.అరుణకుమారి సూచించారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో గురువారం సాయంత్రం వనితా వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్కనీల్లో మొక్కల పెంపకం విధానాలను వివరించారు. ఆర్గానిక్ కూరగాయల పెంపకానికి అవసరమైన కంపోస్టు ఎరువుల తయారీ విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, కార్యదర్శి ఎం.విజయ, తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో మురుగుతో దుర్వాసన



కాలువలో నిలిచిపోయిన మురుగునీరు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పలుచోట్ల పారిశుధ్య నిర్వహణ లోపించింది. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఈ వార్డుకు అనేక సార్లు వచ్చిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇక్కడ పారిశుధ్య నిర్వహణపై అసహనం వ్యక్తం చేసినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పనితీరులో మాత్రం మార్పు రాలేదు. రుషికొండ, సాగర్‌నగర్, ఎండాడ ప్రాంతాల్లో అనేకచోట్ల కాలువల్లో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన సెగలు కక్కుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు నీరు రోడ్డుపైకి వచ్చేసి దోమలు ప్రబలడంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ శానిటేషన్, హెల్త్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై చర్చ



యూనియన్ నాయకులతో చర్చిస్తున్న ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిటూ) విశాఖ జిల్లా నాయకులు గురువారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో చర్చించారు. చర్చలు అనంతరం ప్రధాన వైద్యాధికారి సిటూ నాయకులతో మాట్లాడుతూ ముఖ్యంగా సేఫ్టీ పరికరాలు, రెయిన్‌కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు, గమ్ముబూట్లు ఇస్తామని, అలాగే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7లక్షలు, అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, కార్మికులకు ఐడీ కార్డులు జారీ చేస్తామన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు చేస్తామని, డెత్, 60 ఏళ్ల దాటిన లాంగ్ ఆబ్సెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోమన్నారన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షుడు టి నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జేఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరదేశిపాలెంలో హెచ్చరిక బోర్డు మాయం



పరదేశిపాలెంలో హెచ్చరిక బోర్డు లేని ప్రభుత్వ స్థలం

మధురవాడ : విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని వున్న ప్రభుత్వ భూమిలో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు మాయమైంది. కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్‌కి చెందిన వర్షం నీరు జాతీయ రహదారిని దాటి పరదేశిపాలెం వైపు వచ్చి హైవేని ఆనుకుని పెద్ద గెడ్డలో ప్రవహించే కాలువ స్థలంగా గతంలో రెవెన్యూ అధికారులు గుర్తించారు. అందుకే ఆ భూమి కొంత అన్యాక్రాంతం అయిపోగా మిగిలిన స్థలం పరిరక్షణకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కానీ హైవేని ఆనుకుని ఉన్న ప్రార్థనా మందిరానికి చెందిన వ్యక్తి బోర్డు తీసేసి గేటు తెరవడమే కాకుండా, రోడ్డు కూడా వేశారు. దీనిపై సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో రెవెన్యూ అధిరారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం కొద్ది రోజులకే మళ్లీ హెచ్చరిక బోర్డు మాయమైనా సచివాలయ వీఆర్వో, సిబ్బంది స్పందించడం లేదు. సదరు ఆక్రమణదారులతో కుమ్మక్కై బోర్డు ఏర్పాటుకు వెనకడుగు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులైనా తక్షణమే స్పందించి హైవేని ఆనుకుని ఉన్న లక్షలాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వర్ణ పుష్పాలతో స్వామికి పూజ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై ఉంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

లలిత పీఠంలో ప్రత్యంగిరా హోమం



లలితపీఠంలో ప్రత్యంగిరా భద్రకాళి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : స్థానిక లలితపీఠంలో అమావాస్య సందర్భంగా గురువారం శ్రీప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితపీఠంలో ప్రతీ నెల అమావాస్య రోజున ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆది పరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు హోమం నిర్వహించినట్లు తెలిపారు. హోమంలో పాల్గొన్న వారికి సర్వదుష్ట గ్రహ బాధలు, శత్రు ప్రయోగ బాధలు, ఆర్థిక, అనారోగ్య, కుటుంబ బాధలు తొలగిపోయి, కోరికలు తీరుతాయన్నారు. అలాగే ఉదయం పీఠంలో శనీశ్వరుని జయంతి సందర్భంగా శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

నిబద్ధత గల కమ్యూనిస్ట్ సీఆర్



చంద్ర రాజేశ్వరరావుకు నివాళులరిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి, తదితరులు

అల్లిపురం: తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకుడు, సీఆర్‌గా పిలవబడే చంద్ర రాజేశ్వరరావు నిబద్ధత గల కమ్యూనిస్ట్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సందర్భంగా గురువారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28 ఏళ్లకు పైగా సీపీఐకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీఆర్ ఉన్నారన్నారు. 1994 ఏప్రిల్ 9న మరణించిన సీఆర్ నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రెహమాన్, ఎం.మన్మథరావు, జి.కాసులరెడ్డి, ఆదారి ఆదినారాయణ, వై.రామారావు, ఎన్.సూరిబాబు, ఎం.శ్రీనివాస్, బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సులతో ఇక్కట్లు

సీతంపేట : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులతో ఇక్కట్లు తప్పడం లేదు. రామాటాకీస్ రోడ్‌లో ఒకవైపు పికప్ పాయింట్... మరోవైపు డ్రాపింగ్ పాయింట్ నిర్వహించడంతో ఆ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో జనం ఇబ్బంది పడుతున్నారు. రామాటాకీస్ రోడ్‌లో అంబేడ్కర్ భవన్ ఎదుట స్థలాన్ని ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణికుల డ్రాపింగ్ పాయింట్‌గా వినియోగిస్తున్నారు. విజయవాడ, హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు అంబేడ్కర్ భవన్ పాయింట్ వద్ద దిగుతున్నారు. అలాగే బస్సుల్లో కార్గో సర్వీస్ ద్వారా వచ్చే లగేజీని కూడా ఇక్కడే రోడ్డుపై దింపుతున్నారు. రోడ్డును ఆక్రమించి బస్సులను గంటల తరబడి నిలిపివేయడంతోపాటు లగేజీ, కార్గో రోడ్డుపై డంప్ చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇదేవిధంగా ఇబ్బంది ఉంటుందని వాపోతున్నారు. అలాగే ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద పికప్ పాయింట్ నిర్వహించడంతో రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 వరకు బస్సులు బారులు తీరుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.